
సాక్షి పల్నాడు

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



డెల్టాకు 3,007 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మ సేవలో మంత్రి గుమ్మనూరు

విజయవాడ: రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు.

ఏపీ అడ్వకేట్స్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా క్రాంతికుమార్



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా డి.క్రాంతికుమార్‌ను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌కుమార్ తెలిపారు. 11 నుంచి 14వ తేదీ వరకు బెంగళూరులో జరిగే సౌత్ ఇండియా అడ్వకేట్స్ టోర్నమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

బాపట్ల: బాపట్ల జిల్లాలో నిలిచిపోయిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు డీపీఓ దాసరి రాంబాబు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నామినేషన్లను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో స్వీకరించనున్నట్లు చెప్పారు. పోలింగ్ 19వ తేదీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 32 గ్రామ పంచాయతీలకు గాను 35 వార్డులకు సభ్యుల ఎన్నిక ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ఇంకొల్లు మండలం పావులూరు సర్పంచి పదవికి, చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామ సర్పంచి పదవికి ఎన్నిక నిర్వహించనున్నట్లు వివరించారు.

యార్డుకు 28,052 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 28,052 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,196 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,030 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

10 నుంచి సీఎల్‌ఐఎస్సీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పరీక్షల విభాగ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు సీఎల్‌ఐఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం తెలిపారు. గుంటూరు బ్రాడీపేట 2/14లోని శ్రీశారదానికేతన్ ఓరియెంటల్ స్కూల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

డీఎడ్ మూడో సెమిస్టర్..

2021–23 బ్యాచ్ డీఎడ్ మూడో సెమిస్టర్ పరీక్షలు గుంటూరులోని సెయింట్ జోసఫ్ బాలికోన్నత పాఠశాలలో ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ శైలజ తెలిపారు. అదే విధంగా డీఎడ్ ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 862.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 56,801 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1200, గరిష్ఠ ధర రూ.2400, మోడల్ ధర రూ.1800 వరకు పలికింది.

'గడప గడపా' మురిసేలా

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈ రోడ్డు నరసరావుపేట 26వ వార్డులో కొత్తగా నిర్మించినది. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ప్రజలు ఈ రోడ్డు నిర్మించాలని విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ఉన్నతధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే రోడ్డు మంజూరైంది. ఇప్పుడు నిర్మాణం పూర్తి చేసుకుంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది నరసరావుపేట 8వ వార్డు. ఇక్కడ సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికుల కోరిక మేరకు ఈ పనులు చేపట్టారు. పనులు జరుగుతున్న తీరును దగ్గరుండి పరిశీలిస్తున్న మున్సిపల్ ఏఈ స్వర్ణరాజును చిత్రంలో చూడొచ్చు.



సంతృప్తస్థాయిలో ప్రగతి

- 538 సచివాలయాలకు రూ.107.6 కోట్లు
- 1,372 పనులకు ఆమోదం
- ఇప్పటికే 418 పనులు పూర్తి

సాక్షి, నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజల గుమ్మం వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలన్న ఉద్దేశంతో సంక్షేమ సర్కారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో 2022, మే 11 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమైంది. ప్రజాప్రతినిధులు దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారం చూపుతున్నారు. ప్రజలు కోరిన పనులు చేపట్టేందుకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ముఖ్యంగా తాగునీటి పైపు లైన్లు, బోర్ల ఏర్పాటు, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, ట్యాంకుల నిర్మాణం, కొత్త విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర పనులపై ప్రజల నుంచి విజ్ఞాపనలు వస్తున్నాయి. అలాగే వివిధ సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైన వారు అర్జీలు పెట్టుకొంటున్నారు.

5,11,453 గడపలను సందర్శించిన ఎమ్మెల్యేలు

పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం సుమారు 6,82,630 గడపలు ఉన్నట్టు సమాచారం. ఇందులో ఇప్పటికే 5,11,453 గడపలను ఎమ్మెల్యేలు సందర్శించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజల నుంచి ఇప్పటివరకు మొత్తం 8,483 అర్జీలను అందుకున్నారు.



మాచర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రభుత్వం విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఫైల్)

జిల్లాకు రూ.107.6 కోట్లు మంజూరు

పల్నాడు జిల్లా మొత్తం 538 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటిలో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున జిల్లాకు మొత్తం రూ.107.6 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి సచివాలయ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే పర్యటించి అక్కడ నెలకొన్న ప్రధాన సమస్యలు గుర్తించి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో అధికారుల ద్వారా అప్‌లోడ్ చేయిస్తున్నారు. వీటిని కలెక్టర్ పరిశీలించి పరిపాలన అనుమతులు మంజూరు చేసి త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చూస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఏడుగురు ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన రూ.67.83 కోట్ల విలువ గల 1,372 పనులకు కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఇందులో ఇప్పటికే రూ.22.61 కోట్ల విలువ గల 418 అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.35.22 కోట్ల విలువ గల 732 పనులు పురోగతిలో ఉన్నాయి. మరో రూ.10 కోట్ల విలువ గల 222 పనులకు టెండర్లు పిలిచారు. వీలైనంత త్వరలో ఈ పనులు ప్రారంభించనున్నారు, ఈ పనులను ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు మొదటి ప్రాధాన్యంగా తీసుకొని పూర్తి చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పనుల ప్రగతి ఇలా..

	పనుల సంఖ్య	విలువ (రూ.కోట్లలో)
మొత్తం ఆమోదం పొందినవి	1,372	67.83
ఇప్పటికే పూర్తయినవి	418	22.61
పురోగతిలో ఉన్నవి	732	35.22
ప్రారంభించాల్సినవి	222	10.00

'గడప గడప' పనులకు అధిక ప్రాధాన్యం



ప్రభుత్వ ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు అందుతున్న అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. అత్యంత ప్రాధాన్యం కలిగిన పనులకు వెంటనే పరిపాలన అనుమతులు మంజూరు చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో రూ.67.83 కోట్ల విలువ గల 1,372 పనులకు అనుమతులు మంజూరయ్యాయి. వాటిలో 30 శాతానికిపైగా పనులు పూర్తవగా, 53 శాతంపైగా పనులు పురోగతిలో ఉన్నాయి. ఇటీవల ఆమోదం పొందిన 16 శాతం పనులకు టెండర్లు పిలిచాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రతినెలా తొలి సోమవారం చేనేత వస్త్రాలు ధరిద్దాం

- జిల్లా అధికారులకు కలెక్టర్ శివశంకర్ పిలుపు
- అట్టహాసంగా చేనేత దినోత్సవం



చేనేత ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలలో చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. తొమ్మిదో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో సోమవారం జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో చేనేత వస్త్రధారణతో కలెక్టర్ పాల్గొన్నారు.

తొలుత పచ్చజెండా ఊపి ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను కలెక్టర్ వివరించారు. జిల్లాలో మూడు ప్రత్యేక చేనేత క్లస్టర్లను ఏర్పాటుచేసి చేనేత కార్మికులకు ఆర్థిక సహకారం, పెన్షన్లు అందిస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలో ఇక నుంచి ప్రతినెలా మొదటి సోమవారం జిల్లా అధికారులంతా చేనేత వస్త్రాలను ధరించి విధులకు హాజరు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం చేనేతరంగ అభివృద్ధికి కృషి చేస్తున్న పెద్దలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వనజ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద'ఖేలా'



వాలీబాల్ క్రీడా పోటీల్లో యువకులు(ఫైల్)

ఆటలకు పెద్దపీట

- అక్టోబర్‌లో 'ఆడుదాం ఆంధ్ర'
- సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా సంబరాలు
- విజేతలకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు
- పల్నాడు జిల్లాలో 538 సచివాలయాల పరిధిలో ఏర్పాట్లు

సత్తెనపల్లి: గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం నడుంకట్టింది. దీనిలో భాగంగా 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున సచివాలయ స్థాయి నుంచి క్రీడా పోటీలను ప్రారంభించనుంది. దీనికోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

శాప్ ఆధ్వర్యంలో..

పల్నాడు జిల్లాలో 416 గ్రామ, 122 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. 46 రోజులపాటు క్రీడా సంబరం నిర్వహించనున్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పురుషులకు, మహిళలకు విడివిడిగా పోటీల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలు నిర్వహించనున్నారు. నాన్ కాంపిటేటివ్‌లో భాగంగా యోగా, టెన్నికాయిట్, మారథాన్, ఆయా గ్రామాల్లోని సంప్రదాయ క్రీడల్లోనూ పోటీలు నిర్వహిస్తారు. స్టేట్ అథ్లెటిక్ ఫెడరేషన్ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో రూ.44.52 కోట్లను మంజూరు చేసింది.

పోటీల నిర్వహణకు కమిటీలు

పోటీల నిర్వహణకు వివిధ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ స్థాయిలో తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీ విస్తరణాధికారి, ఏఈ / డీఈ, పంచాయతీ కార్యదర్శి, క్రీడా పోటీలు నిర్వహించే స్కూల్ హెచ్‌ఎం సభ్యులుగా ఉంటారు. గ్రామ సచివాలయ, మండల, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో డీఈవో, డీఆర్డీఏ పీడీ, యువజన సర్వీసుల సీఈఓ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, జెడ్పీ సీఈవో తదితర అధికారులతో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోని పోటీల విజేతలకు ప్రైజ్‌మనీ అందజేస్తారు.

బహుమతులు ఇలా(రూపాయల్లో)..

స్థాయి	ప్రథమ	ద్వితీయ	తృతీయ
నియోజకవర్గ	20,000	10,000	-
జిల్లా	50,000	30,000	20,000
రాష్ట్రస్థాయి పోటీల్లో ఇలా..			
క్రీడ	ప్రథమ	ద్వితీయ	తృతీయ
బ్యాడ్మింటన్	1,00,000	50,000	30,000
క్రికెట్, కబడ్డీ వాలీబాల్, ఖోఖో	5,00,000	3,00,000	2,00,000

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే



క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. కలెక్టర్ లోతేటి శివశంకర్ పర్యవేక్షణలో ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. అక్టోబర్ 2న పోటీలు ప్రారంభమవుతాయి. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఈ పోటీల ద్వారా ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యం.

– అఫ్రోజ్‌ఖాన్, చీఫ్ కోచ్, డీఎస్‌ఏ, పల్నాడు జిల్లా

అబద్ధాల 'యువగళం'

- అసత్యాలు వల్లెవేస్తున్న లోకేష్
- అమాయక యువతను రెచ్చగొడుతున్నారు
- రైతుల పంట కాలువ ఆక్రమించిన జీవీ
- ఆధారాలతో నిరూపించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నారా లోకేష్ యువగళం పాదయాత్ర పేరుతో తిరుగుతూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అమాయకపు యువతను రెచ్చగొట్టి కేసులు పెట్టించుకుంటే పదవులు ఇస్తామని, వారి జీవితాలను బలి చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం బొల్లా విలేకరులతో మాట్లాడుతూ తాను ప్రభుత్వ భూమిని ఆక్రమించి బ్యాంక్‌లో తనఖా పెట్టి రూ.53 కోట్లు రుణం తీసుకున్నానని లోకేష్ చెప్పారని, అసలు తనకు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో ఖాతానే లేదని, బ్యాంక్ అధికారులు ఇచ్చిన నివేదికను చూపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వినుకొండను రూ.2,400కోట్లతో అభివృద్ధి చేశామని, మాజీ ఎమ్మెల్యే జీవీ తన వెంటబడి నిధులు తెచ్చారని లోకేష్ అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏమిటో చూపించాలని బొల్లా ప్రశ్నించారు. రూ.2,400 కోట్లలో లోకేష్ వాటా ఎంతని అడిగారు. తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. వినుకొండకు వెటర్నరీ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేస్తామని గతంలో చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బొల్లా ప్రశ్నించారు. దమ్ముంటే వినుకొండలో తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు.

మాజీ ఎమ్మెల్యే జీవీ అక్రమాలపై విచారణ

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన కుటుంబసభ్యులు, బినామీలు వినుకొండలో వందల ఎకరాలు ఆక్రమించారని, వీటిపై విచారణ జరుగుతోందని ఎమ్మెల్యే బొల్లా చెప్పారు. వినుకొండ సమీపంలో 251, 253, 249, 255 సర్వే నంబర్లలోని ఎస్ఎస్‌పీ పంట కాలువను ఆక్రమించి తన కుమారుడైన హరీష్ పేరుతో జీవీ గెస్ట్ హౌస్ నిర్మించారని ఆధారాలతో సహా వెల్లడించారు. గెస్ట్ హౌస్ పడగొట్టకుండా ముందస్తుగా కోర్టును ఆశ్రయించి జీవీ స్టే తెచ్చుకున్నారని, ప్రభుత్వ భూమి ఆక్రమించకపోతే కోర్టుకు ఎందుకు వెళ్లారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి తమ పార్టీ నేతల పేరుతోనే తనకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వేయించి నీచరాజకీయాలకు జీవీ తెరలేపారని, ప్రజలకు వాస్తవాలు తెలుసని బొల్లా స్పష్టం చేశారు.

సంగం డెయిరీ అక్రమాల్లో లోకేష్ వాటా ఎంత..?

సంగం డెయిరీ అక్రమాల ద్వారా దూళిపాళ్ల నరేంద్ర దోచుకున్న రూ.వందల కోట్లలో లోకేష్ వాటా ఎంతని బొల్లా ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్ మాటలు నమ్మి అమాయక యువకులు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని ఎమ్మెల్యే హితవుపలికారు. కార్యక్రమంలో ఈపూరు ఏఎంసీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, శావల్యాపురం ఎంపీపీ ముండ్లమూరి సుహాసినిఅనిల్‌కుమార్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, కౌన్సిలర్ షకీలా దస్తగిరి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో మానవత్వం చూపాలి

కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా, మండల అధికారులు మానవత్వం చూపాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి 196 అర్జీలను స్వీకరించారు. పెద్ద ఎత్తున జిల్లా ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పనశ్రీ జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంలకు వినతి పత్రాలను అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతి పత్రాలను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలకు పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారిని జిల్లా అధికారులు సత్కరించారు.

26న జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: ఈనెల 26న మాచర్లలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాలో దాదాపు 15 కంపెనీలు పాల్గొంటాయని వివరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇతర వివరాలకు ఆర్.కిరణ్ (9842747682), పి.శ్రీకాంత్ (9492158153), నానికా నాయక్ (9010585360), ఖాదర్‌బాష (9440988148)లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయక, పిడి డీఆర్‌డీఏ బి.బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని అత్యాచార నిరోధక చట్టం, వెట్టిచాకిరి నిర్మూలన చట్టం, దేవదాసి వ్యవస్థ నిర్మూలనా చట్టం, పారిశుద్ధ్య పనివారల పునరావాస చట్టాలను అమలు పరిచేందుకు డివిజనల్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీల పునర్వ్యవస్థీకరణలో భాగంగా సదరు కమిటీల్లో అనధికార సభ్యులుగా నియమించేందుకు ఆసక్తి గల సేవాభావం కలిగిన ప్రభుత్వేతర సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి సోమవారం తెలిపారు. ఆసక్తి గల ఎన్జీవోస్(ఎస్సీ, ఎస్టీలకు చెందని), ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు పొందొచ్చన్నారు.

ఉత్తమ రైతులకు కలెక్టర్ సత్కారం



రైతులను సన్మానించి, ప్రశాంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్


వర్మీ కంపోస్ట్ అందిస్తున్న కలెక్టర్

నరసరావుపేట: వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ విభాగాలలో ఉత్తమ పద్ధతులు పాటించి పలు పంటలు పండిస్తున్న రైతులను కలెక్టర్ ఎల్.శివశంకర్ సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. సోమవారం జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో రైతుకు వందనం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ, ఉద్యానవన పంటలు సహజ విధానంలో పండించిన పలు రకాల ఆహార ఉత్పత్తులు, కూరగాయలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో పలు రకాల సేంద్రియ ఉత్పత్తులు అధికారులను, ప్రజలను ఆకర్షించాయి. ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి, పత్తి, మిరప పంటలతో పాటు పలు అంతర పంటలను తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి ఉత్తమ రైతులుగా నిలిచిన రాజుపాలెం మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన చింతపల్లి ప్రణతి, మాను కొండవారిపాలెం గ్రామానికి చెందిన టి.సుబ్బారెడ్డి, జి.నాగభూషణ వేణుగోపాలరెడ్డి, ముప్పాల మండలానికి చెందిన లక్ష్మారెడ్డిలను కలెక్టర్ అభినందించారు. పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఆయా గ్రామాల్లో ఉద్యమంగా మారిందన్నారు. రైతులు పలు రకాల ఆరోగ్యవంతమైన పంటలను పండిస్తున్నారన్నారు. జేసీ ఎ.శ్యాంప్రసాద్, డీఏఓ ఐ.మురళి, డీహెచ్ఏ బీజే బెన్నీ, డీఆర్ఓ కె.వినాయకం, వివిధ జిల్లా శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు వర్మీ కంపోస్ట్ అందించాలి

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో వర్మీ కంపోస్ట్ ఎరువును తయారుచేసి గ్రామ పరిసర ప్రాంతాల్లోని రైతులకు తక్కువ ధర కు అందించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపా రు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పల్నాడు వర్మీ–పాలానికి బలిమి నినాదంతో కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో వర్మీ కంపోస్ట్ ఎరువు అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన ఆలూరి శ్రీనివాసరావు అనే రైతు 15 క్వింటాళ్ల వర్మీ కంపోస్ట్ ఎరువును కొనుగోలు చేశాడు. ఈ సంద ర్భంగా లింగంగుంట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.వి.శివప్రసాదును అభినందించారు. జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ మురళి, డీపీఓ విజయ భాస్కరరెడ్డి, ఈఓఆర్డీ విజయ కుమార్, తహసీల్దార్ ఆర్.వి. రమణా నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై సెల్ఫీ ఛాలెంజ్‌కు సిద్ధమా?


పిడుగురాళ్ల 6వ వార్డులో కృష్ణా జలాలను ఇంటిలోపల ట్యాప్ ద్వారా పట్టుకుంటున్న మహిళలను చూపుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లెలిన్‌నగర్‌లో నూతనంగా ప్రారంభించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను చూపుతున్న ఎమ్మెల్యే

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సెల్ఫీల ద్వారా చూపుతు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌లకు అభివృద్ధి పనులపై సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి పనులను సోమవారం చూపుతు నారా లోకేష్ గురజాల నియోజకవర్గానికి మంగళవారం రానున్న సందర్భంగా అభివృద్ధిపై సెల్ఫీ ఛాలెంజ్‌కు సిద్ధమా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి పనులకు ఇప్పటివరకు సుమారు రూ. 3500 కోట్లు వెచ్చించారన్నారు.

టీడీపీ హయాంలో ఒక్క పట్టణానికైనా తాగునీరిచ్చారా..?

స్వాతంత్యం వచ్చిన తరువాత మొట్టమొదటి సారిగా పిడుగురాళ్ల పట్టణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే తాగునీరు ఇస్తున్నాం అని, పట్టణంలో 18 వేలు ఇళ్లు ఉంటే ఇప్పటి వరకు 8 వేల ఇళ్లకు శుద్ధి చేసిన కృష్ణా జలాలను ట్యాప్‌ల ద్వారా ఇస్తున్నామని సెల్ఫీ ద్వారా చూపించారు. జలదీక్ష పేరుతో రూ. 218 కోట్లతో తాగు నీరు ఇస్తున్నామన్నారు. రాబోయే 24 నెలల్లో నియోజకవర్గంలోని 89 వేల ఇళ్లకు తాగునీరు ఇవ్వబోతున్నాం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గానీ, యరపతినేని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడుగానీ ఒక్క గ్రామానికైన తాగునీరు ఇచ్చారా అంటూ ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

నాడు – నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గురజాల నియోజకవర్గంలో 180 ప్రభుత్వ పాఠశాలలను రూ. 73 కోట్లతో ప్రతి పాఠశాలను ఆధునికీకరించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు సౌకర్యాలను కల్పించామన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 22 వేలమంది విద్యార్థులు చదువుకుంటున్నారని, లోకేష్ ఒక్కసారి హైస్కూల్ లోపలకు వచ్చి జరిగిన అభివృద్ధి చూసి వెళ్లాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సెల్ఫీ తీసుకుని సవాల్ విసిరారు.

మీ హయాంలో నిర్మించిన ఒక్క ఆస్పత్రినైనా చూపెట్టగలరా..

గురజాల నియోజకవర్గంలో సుమారు 4లక్షల జనాభా, 2 లక్షల 75 వేలమంది ఓటర్లు ఉన్నారని, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు, 15 ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన యరపతినేనిలు నియోజకవర్గంలో ఒక్క ఆస్పత్రి అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఒక మెడికల్ కాలేజీ, 600 పడకల హాస్పటల్ తెచ్చామని, నియోజకవర్గంలో 6 ప్రాథమిక కేంద్రాలు నిర్మించామని, టీడీపీ హయాంలో ఒక్క హాస్పటల్ అయినా నిర్మించారా అని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సెల్ఫీ సవాల్ చేశారు.

పిడుగురాళ్ల బైపాస్ త్వరలో పూర్తి..

టీడీపీ హయాంలో కేవలం 10 శాతం కుడా బైపాస్ రోడ్డును నిర్మించలేకపోయారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో 70 శాతం బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని, మిగిలిన 30 శాతం రైల్వే బ్రిడ్జి కూడా సెప్టెంబర్ నెల చివరి వరకు పూర్తి చేస్తామని క్యూబ్ లిమిటెడ్ వాళ్లు తెలిపారన్నారు. నేడు బైపాస్ పూర్తి చేస్తుంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే. టీడీపీ ప్రభుత్వంలో చేసిందేమయినా ఉంటే సెల్ఫీ ఛాలెంజ్‌లో లోకేష్ బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

జిల్లా పోలీసు జగనన్నకు చెబుదాంలో 48 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎస్పీ ఆదేశాల మేరకు దిశ డీఎస్పీ యు.రవిచంద్ర అధ్యక్షత వహించి ప్రజల నుంచి 48 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి ఇతర సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు పట్టణానికి చెందిన కంజుల శివభాస్కరరెడ్డి, రాజీవ్ గుప్తాలు అన్నదానం చేశారు.

19న వార్డుల ఎన్నికలు

రాజుపాలెం: ఈ నెల 19వ తేదీన బ్రాహ్మణపల్లి, చౌటపాపాయపాలెం, అనుపాలెం, కొత్త బోధన గ్రామాలలోని వివిధ వార్డులకు ఎన్నికలు జరుగుతాయని ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్‌ల స్వీకారం , 11న స్క్రూటినీ, 12న తిరస్కరించిన నామినేషన్‌పై ఆర్డీఓకు అప్పీల్, 14న నామినేషన్‌ల ఉప సంహరణ, 19వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని తెలిపారు.

శావల్యాపురం స్టేషన్‌కు కొత్త సొబగులు


నూతనంగా ఏర్పాటు చేసిన పై వంతెన



పెంచిన ప్లాట్‌ఫాం

తుదిదశకు ప్లాట్‌ఫాం, పై వంతెన పనులు
గోదాం నిర్మాణానికి యత్నాలు

శావల్యాపురం: కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైల్వే స్టేషన్లకు మహర్దశ పట్టిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా సదరు రైల్వే స్టేషన్లు నూతన హంగులతో రూపు దిద్దుకుంటున్నాయి. ఈ క్రమంలో శావల్యాపురం రైల్వే స్టేషనుకు కొత్తసొబగులు అద్దుతున్నారు. ప్రధానంగా ఈ స్టేషన్ జంక్షన్ కూడా కావడంతో కోట్లరూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను రైల్వే అధికారుల పర్యవేక్షణలో సాగుతున్నాయి. శావల్యాపురం రైల్వే స్టేషనులో గూడ్స్ రైళ్ల రాకపోకలు పెరగటంతో పాటు రైల్వే ట్రాక్‌లు పెంపుదల చేశారు. దీంతో స్టేషనులో నూతనంగా 1200 మీటర్ల ప్లాట్‌ఫాం, పై వంతెన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు ప్రస్తుతం తుదిదశకు చేరాయి. త్వరలో గూడ్స్ రైళ్లు నుంచి రవాణా అయ్యే ఎరువులు తదితర వాటిని నిల్వ ఉంచే విధంగా గోదాం నిర్మాణ చర్యలకు రైల్వే అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నడికూడి–శ్రీకాళహస్తి రైల్వే పనులు శావల్యాపురం రైల్వే స్టేషన్ వరకు పనులు పారదర్శకంగా రైల్వే అధికారులు చేశారు. దీంతో గూడ్స్ రైళ్ల రాకపోకలు పెరగటంతో రైల్వేస్టేషన్ అభివృద్ధికి రైల్వే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వినుకొండ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 12 కోట్లు 4 లక్షల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

స్టేషన్లలో ఆధునిక వసతులు

డివిజన్‌లో రైల్వే స్టేషన్లను అభివృద్ధి పరుస్తున్నాం. ఇందులో భాగంగా శావల్యాపురం స్టేషన్‌లో పనుల చేపట్టాం. అలాగే వినుకొండ రైల్వే స్టేషనులో రైల్వే ప్రయాణికులకు మౌలిక వసతులు, విశ్రాంతి గదులు, మహిళలకు ఏసీ, నాన్ ఏసీ గదులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికులకు ఆధునిక వసతులు కల్పిస్తున్నాం. ఈ పనులు 2024 మార్చి నాటికి పూర్తవుతాయి.

– రామకృష్ణ, రైల్వే డీఆర్‌ఎం, గుంటూరు

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన బాల,బాలికల జట్లతో కోనంకి కిరణ్‌కుమార్, పీఈటీలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్స్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సోమవారం జరిగాయి. ఈ ఎంపికలకు పల్నాడు జిల్లా నుంచి వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీలలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లా తరఫున క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, పి.శివరామకృష్ణ, లక్ష్మీ తిరుపతమ్మ, ప్రసన్న, బి.శివకృష్ణ, షేక్ ఆదం షఫీ, తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు: ఎం. జీవన్ రెడ్డి, జి.హనుమ, వై. శామ్యూల్, వి.నాగేష్, జె.చంద్రశేఖర్, బి.శేఖర్, ఎల్.సాయికుమార్, కె.నవీన్, జి.సురేష్, పి.నవీన్, ఎస్.భార్గవ్, ఎల్.అరవింద్, వై.ఎస్.లికిత్, కె.మహేష్, వై.ఎస్.అఖిల్ **బాలికల జట్టు:** పి.కీర్తిప్రియ, కె.దేవిశ్రీ, ఎం.హారిక, వై.ప్రవల్లిక, వై.కృపారాణి, ఎం.నందిని, టి.భార్గవి, ఎస్. మానుష, ఎం.త్రివేణి, కె.గౌతమి, పి. నాగతేజ, జి.హేమలత, బి.యామిని కీర్తి, పి.సుచరిత

రావులపాలెం ఘటనపై తాడేపల్లి పోలీసుల విచారణ

- గల్లంతైన సుహాసిని తన ఇద్దరు పిల్లలతో తాడేపల్లి క్రిస్టియన్ పేటలో ఉంటున్నట్లు నిర్ధారణ
- స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మృత్యుంజయ లక్ష్మీసాయి కీర్తి
- పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్న సీఐ శేషగిరిరావు


సుహాసిని ఇంటి చుట్టుపక్కల వారిని విచారిస్తున్న తాడేపల్లి సీఐ

తాడేపల్లిరూరల్: మహిళను ఇద్దరు కుమార్తెలతో సహా గోదావరి నదిలోకి తోసిన ఘటనపై తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గోదావరి బ్రిడ్జి వద్ద జరగ్గా, బాధితురాలు తాడేపల్లి నివాసి కావడంతో ఇక్కడ విచారణ ముమ్మరం చేశారు. తాడేపల్లి సీఐ శేషగిరిరావు సోమవారం స్థానికంగా విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. గుడివాడకు చెందిన పప్పుల సుహాసిని (36), భర్తతో విభేదాలు ఏర్పడడంతో విడాకులు తీసుకుని తన పెద్దకుమార్తె లక్ష్మిసాయి కీర్తితో తాడేపల్లిలో నివాసముంటూ ఓ హోటల్‌లో పిండిరుబ్బడం, చట్నీలు వేయడం చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఈమెతో పాటు ప్రకాశం జిల్లా దర్శికి చెందిన సురేష్ ఆమె పనిచేస్తున్న హోటల్‌లోనే వంట మాస్టర్‌గా పనిచేస్తూ ప్రేమిస్తున్నానంటూ పదేపదే వెంటబడడంతో ఇద్దరూ సహజీవనం చేయసాగారు. వీరికి ఒక కుమార్తె కలిగింది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో రెండు సంవత్సరాల నుంచి సుహాసిని తాడేపల్లిలోని క్రిస్టియన్‌పేటలో తన ఇద్దరు కుమార్తెలతో ఒంటరిగా నివాసముంటోంది. అక్కడ నివాసముండే వారికి ఎవరికీ పెద్దగా సుహాసిని వివరాలు తెలియదు. ఈ క్రమంలో శనివారం సురేష్‌తో కలసి కారులో బయటకు వెళ్లినట్లు ప్రాణాలతో బయటపడ్డ పెద్ద కుమార్తె లక్ష్మీసాయి కీర్తి పోలీసులకు చెప్పడం, సురేష్ తన తల్లిని, చెల్లిని, తనను బ్రిడ్జి మీద నుంచి నీటిలోకి తోసేశాడని, తాను పైప్ పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చానని చెప్పింది.

రెండేళ్లుగా క్రిస్టియన్‌పేటలో నివాసం

ఈ విషయాలు రావులపాలెం పోలీసుల ద్వారా తెలుసుకున్న తాడేపల్లి సీఐ శేషగిరిరావు తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్ పేటలో నివాసముంటూ గల్లంతైన సుహాసిని ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రాంబాబు సూచనల మేరకు గల్లంతైన వారి వివరాల కోసం తాడేపల్లిలో విచారణ చేపట్టామన్నారు. సుహాసిని రెండు సంవత్సరాల నుంచి క్రిస్టియన్ పేటలోనే వనమా రాజేష్ ఇంట్లో నివాసముంటోందని, రాజేష్ కుటుంబం ఇబ్రహీంపట్నంలో నివాసముండడంతో వారికి కూడా పూర్తి వివరాలు తెలియదని, ప్రస్తుతం గత రెండు సంవత్సరాల నుంచి సుహాసిని తన ఇద్దరు కుమార్తెలతో నివాసముంటున్నట్లు స్థానికులు చెబుతున్నారన్నారు. మృత్యుంజయురాలైన లక్ష్మీ సాయికీర్తి తాడేపల్లి గేటు సెంటర్‌లో వున్న జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి చదువుతోందన్నారు. సుహాసిని శనివారం సాయంత్రం తన ఇద్దరు కుమార్తెలతో బయటకు వెళ్లినట్లు స్థానికులు చెప్పారన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామన్నారు. నిందితుడు సురేష్ ఆచూకీ కోసం రావులపాలెం పోలీసులతో కలసి తాడేపల్లి ప్రాంతంలో కూడా విచారణ చేపట్టామని గతంలో సురేష్ పలు హోటళ్లలో పనిచేశాడని, ప్రస్తుతం ఇక్కడ పనిచేయడం లేదని గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సురేష్ ఆచూకీ లభిస్తే వెంటనే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శేషగిరిరావు కోరారు.